

సొంతడబ్బా మాహాత్మ్యము

ఇదీ నా సొంతంకాదు. ఎవరో ఎవరికో చెప్పగా ఎక్కడో ఎపుడో విన్న బాపతు.

ఒక చలనచిత్ర నట పితామహుడిని, మరొక కాబోయే నటుడు పలకరించి, నమస్కరించి, "స్వామీ శక్తివున్నా చెల్లనివారూ, లేకపోయినా చెల్లదలచుకున్నవారూ, ఫెళ్ళుమంటూ వెలగాలంటే, ఏం చెయ్యాలిస్వామీ?" అని పృచ్ఛచేశాడు.

వత్సా వినుమని ఒక కథ చెప్పాడా వృద్ధుడు. ఈ ప్రపంచంలో డబ్బా అనేది చాల గొప్పది. విజయసాధనకు ఉత్తమ పరికరం. 'డబ్బా' మూడు విధములు. సొంతడబ్బా, పరడబ్బా, పరస్పరడబ్బా.

వీటిలో సొంతడబ్బా కొంతమందికే చెల్లుతుంది. రెండోది మనకి పనికిరాదు. మూడోది బెష్టు.

దానివల్ల ఏక్‌దమ్మున ఇద్దరేసి వృద్ధిలోకి వస్తారు. కొండొకచో ఒకడు ముందర పైకెక్కిపోయి, అక్కడనించి రెండోవాణ్ణి జుట్టట్టుకు పైకి లాగేస్తాడు. (కొండొకచో నెత్తిన కాలేసి తొక్కేస్తాడనుకో.) ఫలానా ఆయనకి దారుణమైన తెలివితేటలున్నాయి అని ఒకడు మొదలెడితే, ఆ ఫలానావాడు 'అడుగో ఆ ఒకడు లేదూ .... వాడు అలా ఉన్నాడు గాని నివురుగప్పిన నిప్పు, మసిపూసిన మాణిక్యం' అని ప్రచారంచేస్తాడు. అదీ ఏర్పాటు.

పోతే రెండోమార్గం ఉందే, పరడబ్బా. అది ఒక విధంగా సొంతడబ్బాకి రూపాంతరం. పరడబ్బా అంటే, ఇంకోడు గొప్పవాడూ అని మనం పబ్లికున ఒప్పుకోవడమే అన్న అర్థం సరేసరి అనుకో. అలాకాక మనం ఘనులమంటూ 'ప్రతి ఇంకోడూ' కోడై కుయ్యడం అని కూడా ఒక అర్థం వస్తుందిగా. రామచామి అనే మ్యూజిక్ డైరెక్టరు, ఈ రెండో అర్థం ప్రకారం, చూస్తూవుండగా కళ్ళఎదుట, పట్టపగలు గొప్పవాడై ఊరుకున్నాడు.

పాపం అతడు ముందర, నీలాగే వేషం వేద్దామని వచ్చాడు. అది కుదరక, డైరెక్షన్ చేస్తానన్నాడు. పోనీ ఫొటోగ్రఫీ అన్నాడు. ఆఖరికి కథలూ, డైలాగులూ రాయ సిద్ధపడ్డాడు. నటనలోను, రాయడంలోను అతనికి కాస్తో కూస్తో ప్రవేశం ఉంది. కొంత అనుభవం ఉంది. అయినా అతన్ని గురించి డబ్బావాయించి ఓహో అనేవాడు లేక, అర్ధణాకి చెల్లలేదు అతని శక్తి.

ఒక్కొక్క శాఖలో ఛాన్సుకోసం వందేసి మందిని అడిగి లేదనిపించు కోవడంతో, ఒక్కొక్క శాఖకి ఉద్వాసన చెబుతూ వచ్చాడు. చివరికి, సంగీత దర్శకత్వం ఒకటే మిగిలింది. అందులో కూడా లాకేత్వం ఎదురైతే అతని గతి ఏమయేటట్టూ?

ప్లేబాక్ పాటలు పాడతానని ప్రయత్నించవోయ్ అన్నాడు అతని మిత్రుడు.

మనకి పాటలు రావుగదయ్యా అన్నాడు రామచామి.

చిక్కే. అయితే మ్యూజిక్ డైరక్షన్‌కోసం ట్రయి చెయ్యి. అది సులభంకూడా. కిటుకులు నాలుగూ చటుక్కున తెలుసుకు అవీ ఇవీ కాపీకొట్టి కాలక్షేపం చెయ్యొచ్చు. కాస్తపేరొచ్చి గొప్పవాడి వయేసరికి సంగీతంకూడా చచ్చినట్టు వచ్చేస్తుంది. అని సలహా చెప్పాడు ఆ స్నేహితుడు.

అడిగి లేదనిపించుకుంటే, ఆ దెబ్బతో అతని కథ ఆఖరై పోతుంది. అందుకని చాలా జాగ్రత్తగా ఆలోచించాడు.

అప్పటికి అతనికి ఎకరం పాతిక సెంట్ల భూమి ఉంది. ఆ పై పాతిక సెంట్లూ తెగనమ్మి, ఒకళ్ళిద్దరు జతగాళ్ళతో కలిసి చిన్న ఫిలిం కంపెనీ లేపాడు. పావలా అర్ధణా పెట్టుబడితో పదిలక్షల ఆర్భాటం చేసేసరికి, 'వీడిదగ్గర చచ్చు సంభావన పాతికవేలు ఉంటుందిలే,' అనుకుని పదివేలున్న ఒక పెద్దమనిషి అందులో చేరాడు.

సరే రామచామి మ్యూజిక్ డైరెక్టరు; ఆ పెద్దమనిషి ఫిలిం డైరెక్టరూను. మిగతా కంపెనీలకి ఈ రామచామి సంగతి తెలిసింది.

ఓహో కాబోలనుకున్నారు.

అక్కడినుంచి రామచామి తన ప్లాను ఆచరణలో పెట్టాడు.

రామచామిది భారీవిగ్రహం తెలుగు సినిమా అంత – ఆమాటకొస్తే

దాదాపు అరవ సినిమా డైలాగంత పొడుగ్గా ఉండేవాడు. కాగా సగటు భారతీయ హీరోయిన్ అంత లావుగా ఉండేవాడు.

చక్కగా పొద్దుటే స్నానంచేసి, విభూది పిండికట్లు దిద్ది, అర్ధ రూపాయంత కుంకుంబొట్టుపెట్టి, గజంబద్ద మింగేసినట్లు నిటారుగా నిలబడేవాడు.

ఏం? ఇలా తెల్లారేసరికల్లా ముస్తాబై, కంపెనీ వానులో కూర్చునేవాడు. అతని శిష్యబృందం పదిహేనుమంది.

వాళ్ళంతా చూడడానికి శిష్యుల్లా ఉన్నా నిజానికి గురువులన్నమాట. రామచామికి ఒకడు వణకడం నేర్పాడు. ఆ వణకడాన్ని సంగీతపు గమకంగా మార్చడం నేర్పాడు మరొకడు. రాగాల పేర్లన్నీ రాసిచ్చి బట్టీ వేయించాడు మరొకడు. వాయిద్యాల పేళ్ళూ, వాటి చప్పుళ్ళ గుర్తులూ తెలియచెప్పాడు మరొకడు. హిందీ, అమెరికన్, లాటిన్ అమెరికన్ రికార్డులను తర్జుమా చేయడంలో సులువు బలువులు బోధించాడు మరొకడు (ప్రొడ్యూసరు డైరెక్టరు అవాల్సినవాడు).

ఇలా వర్తక రహస్యాలు బాగా నేర్చుకుని, ఆనక సంగీతంకూడా నేర్చేసుకుని నిజంగానే కొంత సాధించాడు రామచామి.

"జి. ఎన్. బి., ఎమ్మె పాసయాక, పాతికేళ్లు పైబడి పనికిరాడని పించుకున్నాక సరిగమలు మొదలెట్టాడు, తెలుసా?"—

మొదలగు పెద్దకథలను పారాయణం చేసేవాడు, నిరాశ చుట్టుముట్టినపుడు.

ఇదంతా ఇలా ఉండగా మరోప్రక్క అసలు ప్లాను అమలుజరిగేది.

చక్కహా పొద్దున్నే ముస్తాబై శిష్యబృందాన్ని వెంటేసుకుని నాలుగైదు కంపెనీలకెళ్ళేవాడు కుశలం అడిగే నెపంతో.

అరవై ఢభ్భై అడుగుల పొడుగనిపించే ఈ ఆసామి, అతని వెనక పదిహేనుగురు శిష్యులూ బిలబిల్లాడుతూ వచ్చేస్తే, ఎవడుమటుకు మర్యాద చేయడు ?

"వణకంసార్ వాంగో" అనేవారు.

"బణకం బళకం" అనేవాడు రామచామి తాంబూలపు నోటితో ముద్దగా ముద్దుగా.

అంటూనే 'తరన్హా రన్హా' అని ఆలపించి చూట్టూ చూసేవాడు. తక్షణం శిష్యులు పదిహేనుగురూ 'ఓహో! సెబ్బాస్! సెమ్మంగుడిదానె! వెహూ ప్రమాదమాకిది' (ప్రమాదమా ఇరికిది అని తాత్పర్యం) అంటూ హాహాకారాలు చేసేవారు.

అవి పూర్తి కాకుండానే రామచామి మళ్ళీ 'దారలార లాల లారలాలలా' అని శ్పానిష్ ట్యూన్ ముక్క విసిరేవాడు. మళ్ళీ సముద్రపు హోరులాగ ఒక కెరటం విరిగిన చప్పుడు పూర్తికాకుండానే మరోదాని హోరు మొదలయేది. ఆ దెబ్బకి ఇతర కంపెనీల నిర్మాతల చెవులు హోరెత్తిపోయి, మనసులు దారుణంగా ఉప్పొంగిపోయి, మాకంటే మాకని బుక్ చేసుకున్నారు.

ఆర్నెల్లు గిర్రున తిరిగేసరికి రామచామి పెద్దసైజు మ్యూజిక్ డైరెక్టరయిపోయాడు.

ఆ సరికి, అతను చాలా కష్టపడి సాధనచేసి నిజంగానే సంగీతం నేర్చుకున్నాడు కూడా.

అయితేనేం. తీరాచూస్తే అది పనికిరాలేదు. అందరు ప్రొడ్యూసర్లూ, హిందీవీ, చేతనైతే విదేశవాళీ ట్యూన్‌లూ మక్కికిమక్కీ పాడింలనే వారే. అది వేరేసంగతి అనుకో.

రామచామి, కొన్నాళ్ళు అలా ఉన్నాక చిరాకేసి, అప్పటికి సంపాదించిన పలుకుబడితో, తనకు ఇష్టమైన నటనాశాఖలో ప్రవేశించి మళ్ళీ పైకొచ్చాడు.

పోతే, తను గొప్పవాడవడానికి కావలసినంత డబ్బా వాయించి సాయంచేసిన శిష్యపరమాణువులకి ఛాన్సులిప్పించి వాళ్ళకి దారి చూపాడు. నమ్మిచెడినవారు లేరు అన్నారు వెనకటికి.

అదీ కథ. అని కథ ముగించాడు ఆ అనుభవజ్ఞుడు" అని కథ ముగించాడు రైల్వేబైరాగి.

* * * *

"బాబూ నీకు ఇంతటి ధైర్యం తెగింపు ఉన్నాయా? విద్య నేర్చుకోకుండా, అందులో ప్రవీణుడనని డబాయించి డబ్బా వాయించి నెట్టుకొచ్చే పట్టుదలా తెగింపూ ఉన్నాయా?" అన్నాడు.

అడ్డంగా తల తాటించాడు రాజు.

"అయితే లాభంలేదు" అన్నాడు బైరాగి. రాజు దిగాలుపడిపోయాడు.

"అయినా భయపడకు. నేను చెప్పినట్లు చేస్తే వృద్ధికొచ్చేస్తావు. నాచేతికో ఐదురూపాయలియ్యి. బేసిన్‌బ్రిడ్జి స్టేషనులో రైలాగ్గానే స్టేషన్ వెనుక ఒక యింటికివెళ్ళి ఓ పూలదండ కొని తెస్తాను. లేపోతే పూలేనా కొంటాను. రైల్లో దండ కడదాం. సెంట్రలు రాగానే అది వేసుకు దిగు. నీకు స్వాగతం ఇచ్చే సినిమావాళ్లు, 'ఫలానా వాడివి నువ్వే' అని గ్రహించడానికి కూడా గుర్తు ఉండాలి కదా. అదే ఈ దండ అన్నమాట తే డబ్బు!" అంటూ బైరాగి అతన్ని లేవదీశాడు.

బేసిన్‌బ్రిడ్జి స్టేషనులో బైరాగి రైలు దిగాడు గాని, ఎంచేతనో మళ్ళీ ఎక్కలేదు.

అందుకని వరహాలరాజు బిక్కమొహం వేసుకుని ఒక్కడే మద్రాసు సెంట్రల్ రైల్వేస్టేషనులో రెండోనెంబరు ప్లాటుఫారంమీద కుడికాలు మోపాడు దేముడిని తలచుకుని.

చుట్టూ పరకాయించి చూశాడు తనకోసం ఎవరన్నా ఎదురొచ్చారేమోనని.

పదినిమిషాల తర్వాత అతనికి బుర్ర పనిచేసింది. తనకి సినిమావాళ్లు స్వాగతం ఇవ్వబోతున్నారని తను ఉత్తినే బైరాగికి అబద్ధం చెప్పాడన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. మర్చిపోయి, అది నిజమే అనుకున్నందుకు, అనుకుని నిరుత్సాహపడ్డందుకూ, నవ్వుకుని, ధైర్యం తెచ్చుకుని నరసన్న తనకు వదిలిపెట్టిన పెట్టిని (చిత్తుకాగితాలు సహా) చేతబట్టి, ముందరకు అడుగుపెట్టాడు వరహాలరాజు.